క్లుప్తంగా

నందివిగ్రహం ఏర్పాటు



ఉండవెల్లి: మండలంలోని డీ బూడిదపాడు శివారులోని కూడలిలో అలంపూర్ పుణ్యక్షేత్రాన్ని భక్తులను ఆకట్టుకునేందుకు బసవేశ్వరుని (నంది) విగ్రహాన్ని క్రేన్ సహాయంతో ఏర్పాటు చేశారు. దాత దర్వాయి రమేష్ రూ.3.70లక్షలతో నందీశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. త్వరలో ప్రతిష్ఠ నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిన్ని కృష్ణయ్య, ధర్మకర్తలు వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటనారాయణ, నాయకులు నీలప్ప, శర్ణయ్య పాల్గొన్నారు.

ఉండవెల్లిలో బీజేపీ ర్యాలీ



ఉండవెల్లి: మండల కేంద్రంలోని బీజేపీ విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆదివారం జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, ప్రజా సంకల్ప యాత్ర ఇన్చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ మోర్చ అధ్యక్షుడు అప్సర్ బాషా, యాదగిరి రెడ్డి, రాజశేఖర్ శర్మ, కేకే రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్ పర్యటనను విజయవంతం చేయాలి

గట్టు: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గద్వాల పర్యటనను విజయవంతం చేయాలని బీఎస్పీ సీనియర్ నాయకులు బండారి రాజు కోరారు. 'రాజ్యాంగాన్ని రక్షించాలి-జన్వాడ దోషులను శిక్షించాలి' అనే నినాదంతో సోమవారం గద్వాలలో మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: మున్సిపాలిటీలోని భరత్‌నగర్ కాలనీలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ గోవిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన కొత్తలైన్ ఎరెక్షన్ వర్క్ పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కాలనీలో విద్యుత్ సరఫరాకు కోత విధిస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ పేర్కొన్నారు. కాలనీ ప్రజలు సహకరించాలని కోరారు.

వాల్మీకి బోయలకు ఎస్టీ జాబితాలో చేర్చాలి



శాంతినగర్: భారతదేశం అంతటా వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉన్నారని, తెలంగాణలో మాత్రం బీసీ ఏగా పరిగణిస్తున్నారని, తెలంగాణలోని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా చూడాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతికి వడ్డేపల్లి మున్సిపాలిటీ వాల్మీకులు వినతిపత్రం సమర్పించారు. గత ఎన్నికల సందర్భంగా కర్నూల్‌లో వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రధాని నరేంద్రమోడీ హామీ ఇచ్చారని, ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదని, అధిష్టానం దృష్టికి ఎస్టీ రిజర్వేషన్ గురించి ప్రస్తావించి వాల్మీకుల చిరకాల కోరికను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వడ్డేపల్లి మున్సిపాలిటీలోని ఆయా వార్డులకు చెందిన వాల్మీకులు పాల్గొన్నారు.

ఎంపీ సీటును సంపత్‌కుమార్‌కు ఇవ్వాలి



అయిజ: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ సీటును కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌కు కేటాయించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ కోరారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు సంపత్ కుమార్ నిరంతరం కృషి చేశారన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో గెలిచేందుకు అవకాశం ఉన్న సంపత్ కుమార్‌కు అధిష్టానం బీఫాం ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు. కార్యక్రమంలో శాలి పైల్వాన్, అనిల్, తిరుమల్, అహ్మద్, షబ్బీర్, షఫీ, చాంద్, రహీం, ఖలీల్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు విరాళం

అయిజ: కలుగొట్లలో త్వరలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠ కోసం రూ.5 వేల విరాళం బీఆర్ఎస్ నాయకుడు సంకాపురం రాముడు అందజేశారు. మద్దూరులో చర్చి నిర్మాణానికి రూ.5 వేలు విరాళం అందజేశారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది?

- పల్లెల్లో కరువైన పరిశుభ్రత
- వ్యాప్తి చెందుతున్న క్రిమి, కీటకాలు
- దోమల నివారణకు చర్యలు శూన్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఎర్రవల్లిలో కుంటగా ఏర్పడిన మురుగు

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల్లో మురుగు నీరు ఇళ్ల మధ్య, పరిసర ప్రాంతాల్లో కుంటలుగా మారుతున్నప్పటికీ సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమవుతున్నారు. ఆయా గ్రామాల్లో ఇళ్ల నుంచి వచ్చిన వ్యర్థపు నీరు, మిషన్ భగీరథ పైప్‌ల లీకేజీల ద్వారా వచ్చిన నీరు మురుగుగా ఏర్పడి దోమలు, ఈగలకు నివాసాలుగా మారాయి. దీనికి తోడు ఆయా కాలనీలలో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీనివల్ల దోమల ఉధృతి పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అయినప్పటికీ పాలకులు, అధికారులు ముందు జాగ్రతగా దోమల నివారణకు ఎలాంటి ప్రత్యేక చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో కరువైన పరిశుభ్రత..

ఇటిక్యాల, ఎర్రవల్లి మండల కేంద్రాలతో పాటు బీచుపల్లి, పుటాన్‌దొడ్డి, యాక్తాపురం, సాసనూలు, దువాసిపల్లి, కారుపాకుల, గార్లపాడు, ధర్మవరం, వల్లూరు, వేముల, చాగాపురం, షాబాద్, ఉదండాపురం, సాతర్ల, పెద్దదిన్నె, కొండేరు, తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. ఇటీవల పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం 15 రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా పల్లె ప్రగతిని నిర్వహించినా సమస్యలు తీరలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఆయా గ్రామాలలో మురుగు రోడ్లపైనే ఇష్టానుసారంగా పారుతోంది. అక్కడక్కడ డ్రెయినేజీలున్నా వాటిని కార్మికులు సక్రమంగా శుభ్రం చేయడం లేదు. దీంతో దోమలు అధికంగా వ్యాప్తి చెంది అనారోగ్యం బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి దోమల నివారణకు ఎలాంటి ముందస్తు చర్యలను చేపట్టకపోవడంతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

ఫాగింగ్, బ్లీచింగ్‌ల జాడేలేదు..

ఆయా గ్రామాలలో వ్యర్థపు నీరు, మురుగు అక్కడక్కడ కుంటలుగా ఏర్పడింది. ప్రతి ఇంటికి తాగు నీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

మిషన్ భగీరథ పైపుల లీకేజీ కారణంగా అంతర్గత రోడ్లన్నీ మురుగు నీటి కుంటలుగా దర్శనమిస్తున్నాయి. దీని ద్వారా కాలనీల్లో మురుగు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లకపోవడంతో ఈగలు, దోమలు గుడ్లుపెట్టి విచ్చలవిడిగా వ్యాప్తి చెందుతున్నాయి. దీనివల్ల కాలనీల్లో ఫాగింగ్ మిషన్ వినియోగించకపోవడంతో దోమలు, ఈగలు మరింత ఉధృతమవుతున్నాయి. పల్లెల్లో డ్రెయినేజీ వ్యవస్థలు సక్రమంగా లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. గ్రామాల్లో దోమల నివారణకు పాగింగ్ ఎందుకు చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దోమలతో సతమతమవుతున్నాం..



ఎర్రవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని షేకుపల్లి రోడ్డులో డ్రెయినేజీ సమస్యతో నిత్యం చాలా ఇబ్బందులు పడుతున్నాం. డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షపునీ రు, మురుగు రోడ్లపై పారుతోంది. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా చర్యలు తీసుకోవాలి.

– రవికుమార్, ఎర్రవల్లి

నివారణ చర్యలు చేపడుతున్నాం..



గ్రామాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ యంత్రాలకు బదులుగా ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. అవసరమైనచోట, ఎక్కువగా జనాలు సంచరించే ప్రాంతాలలో ఫాగింగ్ మిషన్ ద్వారా ఫాగింగ్ చేపడుతాం. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిత్యం కార్యదర్శులకు సూచిస్తున్నాం. ఎక్కడైనా పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల

సీఎం సార్ చర్య తీసుకుంటారా?

- కరెంట్ కోతలపై కొత్త రాజోళి వాసుల ఆందోళన
- విచ్చలవిడి కోతలతో విసిగిన స్థానికులు



శనివారం అర్ధరాత్రి సబ్‌స్టేషన్ వద్ద కొత్త రాజోళి వాసుల ఆందోళన

రాజోళి: ఎక్కడైనా కరెంట్ కటింగ్‌లు కనిపిస్తే, కరెంట్ లేదని వినిపిస్తే ఆ ఏరియాకు సంబంధించిన అధికారులను సస్పెండ్ చేస్తాం. ఇది సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన. అయినా కరెంట్ అధికారులకు ఏమాత్రం భయం లేదని, వారు తమకు నచ్చిన విధంగా కోతలు విధిస్తున్నారని కొత్త రాజోళివాసులు పేర్కొంటున్నారు. కొన్నేళ్లుగా కొత్త రాజోళిలో జీవనం ఉంటున్న తమకు కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో జరగాల్సిన మేలు కంటే నష్టమే ఎక్కువ జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా కరెంట్ కోతలు విధిస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త రాజోళిలో వేలాది కుటుంబాలకు అందుబాటులో సబ్‌స్టేషన్ ఉన్నా కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉంది. ఈ విషయంపై వచ్చిన ప్రతి అధికారికి వినతులు, ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. కరెంట్ కోతలపై చర్యలు తీసుకున్న అధికారులు, నాయకులు లేరు. తాజాగా ప్రస్తుత సీఎం ఇచ్చిన ఆదేశాలకు కూడా భయపడకుండా స్థానిక అధికారులు కోతలు విధిస్తుండడంతో అధికారుల నిర్లక్ష్యమేంటో అర్థమవుతోంది. ఎన్నో రోజులుగా అంధకారంలో ఉంటున్న వారు తాజాగా శనివారం రోజు ఎదుర్కొన్న తమ కష్టాలను ప్రత్యక్షంగా 'సాక్షి'కి తెలిపారు. శనివారం మధ్యాహ్నం నుంచి కరెంట్ లేదని, సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు ఫోన్లు చేయగా రాత్రి వచ్చిన కరెంట్ కనీసం నాలుగు గంటలైనా ఉంచకుండా, మళ్లీ అర్ధరాత్రి కట్ చేయడంతో ప్రజలు బెంబేలెత్తారు. ఈ సమస్య ఈ రోజు కొత్తేమీ కాదని, కొన్ని నెలలుగా అనుభవిస్తున్నామని, అధికారులు మారినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు. కొత్త రాజోళి పురావాసం, అసంపూర్తిగా ఉన్న గృహాలు, గృహాల మధ్యలో ఉన్న పిచ్చి మొక్కలు, వాటి మధ్య తిరిగే విష సర్పాలు, పిచ్చి కుక్కలు కనిపిస్తాయి. ఎంతో మంది గాయపడినా, ప్రాణాలు పోయినా అధికారుల తీరు మారలేదు. ఈ ప్రభుత్వంలోనైనా తమ కరెంట్ సమస్య తీరుందని అనుకుంటే ఇప్పటికీ అధికారుల తీరు మారలేదని స్థానికులు పేర్కొంటున్నారు. దీని కోసం శనివారం అర్ధరాత్రి వరకు సబ్‌స్టేషన్ వద్ద అధికారులతో మాట్లాడినా స్పందన రాలేదు. స్థానికులతో కలిసి ధర్నా చేసేందుకు సిద్ధం కాగా, ఆ పూటకు నాలుగు గంటలు కరెంట్ ఇచ్చి మళ్లీ కట్ చేశారని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత విద్యుత్ ఏఈకి ఫోన్ చేయగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

కొన్నేళ్లుగా ఇదే సమస్య



కొన్నేళ్లుగా కొత్త రాజోళిలో కరెంట్ సమస్య ఎదుర్కొంటున్నాం. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పు డు పోతుందో తెలియదు. మిగతా అన్ని చోట్ల కరెంట్ ఉంటుంది. మా కొత్త రాజోళిలో మాత్రం కరెంట్ ఉండదు. అర్ధరాత్రి వ రకు కరెంట్ కోసం అధికారులకు ఫోన్లు చేయాలి. సంబంధిత అధికారులు సక్రమంగా విధు ల్లో ఉండరు. శనివారం రోజు ఉన్న కరెంట్ కోతలకు స్థానికులు ఎదుర్కొన్న ఇబ్బందులు చెప్పలేం. సీఎం మాటల్లో చెప్పడం కాదు. చర్యలు తీసుకోవాలి.

– విజయ్ కుమార్, కొత్త రాజోళి

నైతిక విలువలతోనే ఉన్నత విజయాలు



ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న విద్యార్థులు



పౌరాణిక నాటక ప్రదర్శనలో విద్యార్థులు

అలంపూర్: విద్యార్థులు క్రమ శిక్షణ నైతిక విలువలను పెంపొందించుకుంటే భవిష్యత్‌లో ఉన్నత విజయాలు సాధించవచ్చని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో స్కూల్ డే సంబురాలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే వి జయుడు హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమలో ని సృజనాత్మకత, నైతిక విలువలు, క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను అ లవర్చుకోవాలన్నారు. ఉన్నత విలువతో విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలల డైరెక్టర్ రవి ప్రకాష్ మాట్లాడారు. విద్యార్థులు తమ ప్రతిభకనబర్చితే అందుకుతగ్గట్టుగా వారిని ప్రొత్సహించడానికి ప్రయత్నిస్తున్నట్లు పే ర్కొన్నారు.

మాంటిస్సోరి పాఠశాలలో స్కూల్ డే వేడుకలు కనుల పండవగా నిర్వహించారు. విద్యార్థులు దేశంలోని వివిధ రాష్ట్రాల వేషధారణలతో ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ ఆఫ్‌ద ఇయర్, అకాడమి ఎక్సటెంట్ బహుమతులను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్పు గురువులతోనే సాధ్యం

ఉండవెల్లి: సమాజంలో మార్పు గురువులతోనే సాధ్యమని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 1994–95 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి అయిన ఎమ్మెల్యే విజయుడు హాజరై మాట్లాడారు. గురువులు లేకుంటే మనం ఏదీ చేయలేమన్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. మృతి చెందిన ఉపాధ్యాయుల ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలోని పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఎమ్మెల్యే విజయుడు

నల్లమట్టి తరలింపుపై రైతుల అభ్యంతరం



గట్టు: మండలంలోని మాచర్ల గ్రామ చెరువులో నల్లమట్టి తరలింపుపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం మాచర్ల చెరువు నుంచి అక్రమంగా నల్లమట్టిని తరలిస్తున్నట్లు ఆయకట్టు రైతులు పేర్కొన్నారు. పెద్ద ఎత్తున నల్లమట్టిని తరలించేందుకు యంత్రాలను సిద్ధం చేసి, భారీ వాహనాలతో నల్లమట్టి తరలింపును చేపట్టారు. చెరువుల్లోంచి నల్లమట్టి తరలించడం ద్వారా చెరువులో వర్షపు నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండదని, భూమికిలోకి ఇంకి పోతుందని రైతులు తెలిపారు. చెరువులో నల్లమట్టి తరలింపును నిలిపేయాలని రైతులు డిమాండ్ చేశారు.

బీటీ రోడ్డుపై గుంతలను పూడ్చాలి



మల్దకల్: గద్వాల–అయిజ ప్రధాన రహదారిలోని అమరవాయి–సద్దలోనిపల్లి గ్రామాల మధ్యన బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు. 8 ఏళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు గుంతలమయంగా మారిందని, దీంతో ప్రతి నిత్యం వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాహనదారులు రాజశేఖర్, తిప్పన్న, వెంకటేష్‌గౌడులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మాదవస్వామి ఆలయం ముందు స్వాములు



కేటీదొడ్డిలో శివస్వాముల మెట్లపూజ

అయిజ: మండలంలోని వివిధ గ్రామాల ఆలయాల్లో ఆదివారం అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో రాత్రి ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని గుంటిరంగనాథ స్వామి ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఉప్పలలో జమ్ములమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దాతలు భోజన వసతి కల్పించారు.

మాధవస్వామి ఆలయంలో..

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డిలో మాధవస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు సందడి చేశారు. ఆలయంలో స్థానిక శివస్వాముల ఆధ్వర్యంలో శివ మెట్ల పూజ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు, కర్నూల్ జిల్లా లోని పలు గ్రామాల నుంచి శివ స్వాములు హాజరయ్యారు. ఆలయం ముందు స్వాములు చేసిన నృత్యాలు విశేష ఆకర్షణగా నిలిచాయి.

ఘనంగా శివస్వాముల మెట్లపూజ

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని ఆదివారం శివనామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా శివ స్వామి ఉరుకుందు ఆధ్వర్యంలో శివస్వాముల మెట్లపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమమానికి జెడ్పీటీసీ రాజశేఖర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివస్వాములు ఉన్నారు.

శివస్వాముల అన్నదానం

ధరూరు: మండల కేంద్రంలో శివ స్వాములు గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. ఆదివారం వీరభద్ర స్వామి ఆలయం వద్ద శివ స్వాములు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంతకు ముందు తెల్లవారు జామున స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు 3వేల మంది భక్తులు హాజరైనట్లు గురు స్వామి మల్లన్న, సీతారాములు తెలిపారు. కార్యక్రమంలో శివ స్వాములు కిష్టన్న, రవి, మెడికల్ రవి, గోపిరెడ్డి పాల్గొన్నారు.



జములమ్మ ఆలయంలో భక్తుల పూజలు



ధరూరులో అన్నదానం చేస్తున్న శివస్వాములు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఎర్రవల్లిచౌరస్తా: రాష్ట్ర స్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో ఎర్రవల్లికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన 5వ రాష్ట్ర స్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలో ఎర్రవల్లి సరస్వతి, ఏకశిల పాఠశాలలకు చెందిన విద్యార్థులు జగదీష్, రక్షిత్, కార్తిక్, చక్రధర్, రేవంత్‌రెడ్డి, గోకుల్, హేమంత్, నందిని, యక్షిత, జగదీష్, వీరేష్, గూగుల్, దినేష్, వేణుతేజ లు సీనియర్, జూనియర్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి బంగా రు, వెండి పతకాలను సాధించారు. ప్రతిభ కనబర్చిన చిన్నారులు మాస్టర్లు శ్రీనివాస్, రాజు, అరుణ్‌ల చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రాలతో పాటు పతకాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పోటీల్లో గెలుపొందిన చిన్నారులను మాస్టర్లు విజయ్, రాజు, వారి తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతుబంధు నిధుల దారి మళ్లింపు

- రైతుల ఆందోళన
- అధికారుల రహస్య విచారణ
- అధికారిని రక్షించేందుకు చివరి దాకా ప్రయత్నం



గట్టు: మొన్న రైతు బీమా నిధులను దుర్వినియోగం చేసిన వ్యవహారం మరువక ముందే, నేడు రైతు బంధు నిధులను మళ్లించి స్వాహా చేసిన వ్యవహారం వెలుగు చూడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బల్గెర గ్రామానికి సంబంధించిన రైతుబంధు నిధుల మళ్లింపు వ్యవహారంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 64 మంది రైతులకు సంబంధించిన రూ.36 లక్షల రైతుబంధు నిధులు వేరే వ్యక్తుల ఖాతాల్లో జమ చేసిన వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో మిగతా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ప్రజాప్రతినిధి మరణాంతరం కూడా రైతుబంధు నిధులు రాగా, వాటిని కూడా మళ్లించినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో రైతులతో లోపాయకారి ఒప్పందాలను కుదుర్చుకునేందుకు కొందరు నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. రైతుబంధు నిధులు దారి మళ్లింపు వ్యవహారంలో చనిపోయిన రైతులతో పాటు ఇక్కడ పొలాలు ఉండి వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్న రైతులను లక్ష్యంగా ఈ వ్యవహారం నడిపినట్లు ఆరోపణలున్నాయి. దీంట్లో ఏఈఓతో పాటుగా బల్గెరకు చెందిన ఓ వ్యక్తి, ఇందువాసి గ్రామానికి చెందిన మరో వ్యక్తి ప్రమేయం ఉన్నట్లుగా ఆరోపణలు విన్పిస్తున్నాయి. 2019 నుంచి 2022 వరకు వ్యవహారం నడిపించారు. రైతుబంధు రైతుల ఖాతాల నమోదు విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయం తెలుసుకున్న రైతులు కొందరు తిరగబడి, కొందరు బాధిత రైతులతో ఒప్పందాలు చేసుకుని వ్యవహారం బయటి పొక్కకుండా జాగ్రత పడ్డారు. అయితే ఇదంతా గ్రామంలోని మీ సేవ కేంద్రంగా వ్యవహారం నడిపినట్లు ఆరోపణలున్నాయి.


రైతుల ఉలికిపాటు..

మాచర్ల గ్రామానికి చెందిన రైతులు గతంలో తమకు డబ్బులు పడలేదని, ఇక్కడ కూడా ఏమైనా అవకతవకలు జరిగి ఉండవచ్చనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. బల్గెర సంఘటన వెలుగు చూసిన నేపథ్యంలో మాచర్లకు చెందిన కొందరు రైతులు బ్యాంకులకు వెళ్లి స్టేట్‌మెంట్లు తీసుకుని పరిశీలించుకుంటున్నారు. మాచర్ల క్లస్టర్ ఏఈఓగా పని చేస్తున్న దివ్య బల్గెర ఏఈఓగా అదనపు బాధ్యతలు (2018–19) నిర్వహిస్తున్న తరుణంలో రైతు బంధు నిధులు పక్కదారి పట్టించిన వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూసింది. బల్గెర ఏఈఓగా పని చేస్తున్న దివ్యకు మరో ఇద్దరు యువకులు తోడై రైతు బంధు నిధులు దారి మళ్లించినట్లు ఆరోపణలున్నాయి. దివ్య స్థానంలో మరో అధికారి ఏఈఓగా బాధ్యతలు స్వీకరించిన తరుణంలో రైతు బంధు నిధులు మళ్లించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

అధికారుల రహస్య విచారణ..

రైతు బంధు నిధులను మళ్లించిన వ్యవహారంపై ఓ రైతు నేరుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆఘమేగాలపై కదలి బాధ్యురాలైన ఏఈఓపై చర్యలకు కలెక్టర్‌కు సిపారసు చేశారు. ఈ వ్యవహారంపై ఇది వరకే జిల్లా వ్యవసాయ అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ దీన్ని పట్టించుకొకుండా తొక్కి పెట్టినట్లు ఆరోపణలున్నాయి. బాధిత రైతు నేరుగా వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో తప్పని పరిస్థితిలో వెలుగులోకి వచ్చింది. బాధ్యులైన అధికారిపై సస్పెన్షన్ వేటు వేశారు. జిల్లా స్థాయి అధికారి వారం రోజుల క్రితం మండలంలో పర్యటించి రహస్య విచారణ నిర్వహించిన అనంతరం కలెక్టర్‌కు నివేదించిన తర్వాతే బల్గెర ఏఈఓపై సస్పెన్షన్ వేటు వేశారు. రైతుబంధు నిధులను దారి మళ్లించిన వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జోగుళాంబ సన్నిధిలో మెగాస్టార్ కుమార్తె



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను ఆదివారం సినీ హీరో మెగాస్టార్ చిరంజీవి కుమార్తె శ్రీజ దర్శించుకున్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, నా యకులు దర్శించుకున్నారు. వేర్వేరు సమయాలలో వచ్చిన వీరంతా ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన స్వాములు విలేకరిగా విధులు నిర్వహించేవాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. స్వాములు మృతదేహానికి అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు నివాళులర్పించాడు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించాడు. కుటుంబానికి అని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.